క్లుప్తంగా

అధికారమే ధ్యేయంగా పనిచేయండి



మైలవరం: వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పార్టీ మైలవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మైలవరంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. నియోజకవర్గంలోని ప్రజలంతా జగనన్న కుటుంబం అని, అందరూ ఐకమత్యంతో పనిచేసి మైలవరం గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా అని మరొకసారి తెలియజేసే విధంగా మైలవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి, కఠారి ఉమామహేశ్వరరావు, పాలా నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి 70 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



మైలవరం: పేదలకు మేలు చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు అందరం కలిసి పనిచేయాలని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. విజయవాడ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బయ్యారపు రవి కిషోర్, పైడూరుపాడు సర్పంచ్ వేముల సీతారామయ్యల ఆధ్వర్యంలో షాబాద్, జక్కంపూడి గ్రామాలకు చెందిన తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు 70 కుటుంబాలకు చెందిన వారు బుధవారం మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు సమక్షంలో పార్టీలో చేరారు. తిరుపతిరావు వారందరికీ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

నూతిపాడు (విస్సన్నపేట): వేమిరెడ్డిపల్లి పంచాయతీ నూతిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. సీతారామ లక్ష్మణ హనుమత్ సహిత శిలా ధ్వజ గ్రామ నాభిశిల, ముత్యాలమ్మ దేవతా ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, జేఏసీ కన్వీనర్ అనుమోలు శివబాజీ, ఎంపీటీసీ సత్యనారాయణాచారి, పంతంగి రమేష్, భక్తులు పాల్గొన్నారు.

మద్యం కేసులో ముగ్గురి అరెస్ట్

తిరువూరు: తిరువూరు సర్కిల్‌లో బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. విస్సన్నపేట మండలం తాతకుంట్ల తండాలో సారా విక్రయిస్తున్న వడిత్యా రవిని అరెస్టు చేశారు. ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అజ్మీర దుర్గ నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తిరువూరు మండలం ఆంజనేయపురంలో ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలు తరలిస్తున్న గుంజి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు.

మండలంలో 33 శాతం పింఛన్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని 10 గ్రామ పంచాయతీలు, 11 సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని ఎంపీడీఓ అనూరాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,897 మంది లబ్ధిదారులకుగాను 1,635 మందికి రూ.1,45,72,500 పింఛను నగదు సచివాలయ సిబ్బంది అందజేశారన్నారు. 33.39 శాతం పంపిణీ జరిగిందని చెప్పారు. గురువారం మిగిలిన వారికి పంపిణీ చేస్తామన్నారు.

శివాజీ మహరాజ్‌కు ఘన నివాళి

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశంలో మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి వారి దురాగతాలకు చమరగీతం పాడి, మరాఠా రాజ్యాన్ని స్థాపించి మెరుగైన పాలనను ఛత్రపతి శివాజీ అందించారని వివరించారు. యువత ఛత్రపతిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని చెప్పారు. ఉపాధ్యాయులు లింగమ్మ, అంజలి, విద్యార్థులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పండుటాకుల పడిగాపులు

- పెన్షన్ల కోసం మండుటెండలో నిరీక్షణ
- మధ్యాహ్నం వరకు జరగని పంపిణీ
- చంద్రబాబుకు మా ఉసురు తప్పదని విమర్శలు
- వలంటీర్లుంటే మాకు ఈ బాధలుండేవి కావని ఆవేదన



గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామ సచివాలయం వద్ద పింఛను నగదు కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



రామచంద్రాపురం సచివాలయం వద్ద పింఛనుదారుల పడిగాపులు

తిరువూరు/మైలవరం/నూజివీడు: గత ఐదేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసే వైఎస్సార్ పెన్షను కానుకను వలంటీర్లు ఇంటి వద్దకే తెచ్చి ఇస్తుండగా..ఎన్నికల నిబంధనల పేరుతో తెలుగుదేశం పార్టీ ఫిర్యాదు చేయడంతో సచివాలయాల్లోనే పింఛను పంపిణీ చేయడం వృద్ధులు, దివ్యాంగులకు ప్రాణసంకటంగా మారింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచే పలు గ్రామాల్లో పెన్షనుదారులు చెట్ల కింద, కార్యాలయ మెట్ల పైన పడిగాపులు పడ్డారు. తీరా బ్యాంకు నుంచి నగదు తీసుకు రావడం ఆలస్యమవుతుందని, మధ్యాహ్నం 3 గంటల తర్వాత రమ్మని సిబ్బంది చావు కబురు చల్లగా చెప్పడంతో వీరి పరిస్థితి దయనీయంగా మారింది. దూరాభారమైనా తమ అవసరాలకు ప్రభుత్వం అందించే పెన్షను సొమ్ము చేతికి వస్తుందనే ఆశతో పడుతూ లేస్తూ సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు మళ్లీ ఇళ్లకు వెళ్లలేక మండుటెండలో, వడగాడ్పులో అక్కడే వేచి ఉన్నారు. వలంటీర్లు ఉంటే తమకు ఈ బాధలు ఉండేవి కావని, ఈ దుస్థితికి కారణమైన చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని పలువురు వ్యాఖ్యానించారు.

శివారు గ్రామాల పింఛనర్ల పరిస్థితి దయనీయం

తిరువూరు మండలంలోని రోలుపడి, వావిలాల, ఎర్రమాడు, కాకర్ల, లక్ష్మీపురం, కోకిలంపాడు గ్రామాల్లో శివారు ప్రాంతాల నుంచి సచివాలయానికి వచ్చేందుకు ఆటోలు లేక, 3, 4 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లవలసి వచ్చిందని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎ.కొండూరు మండలంలో పెద తండా, వెంకట తండా, కోమటికుంట, లక్ష్మీపురం, పాతరేపూడి, కోడూరు, కొండూరు తండా, దీప్లానగర్, కేశ్యా తండా, గ్యామా తండా, పడమటి మాధవరం, మీట్యా తండా, గొల్లమందల తండా, విస్సన్నపేట మండలంలోని కోటిపల్లి, రామానగరం, నర్మదానగర్, గంపలగూడెం మండలం చల్లగుండ్లవారిపాలెం, జింకలపాలెం, రామన్నపాలెం, చెన్నవరం, లింగాల, సొబ్బాల, ఉమ్మడిదేవరపల్లి గ్రామాలు సచివాలయాలకు 3, 4 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పింఛనుదారులు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండలంలోని 21 గ్రామ, వార్డు సచివాలయాల వద్ద సామాజిక పింఛన్ దారులు పడిగాపులు పడ్డారు. టీడీపీ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.



తిరువూరు సుగాలీ కాలనీ సచివాలయం వద్ద ఆరు బయట పింఛన్ల పంపిణీ



ఎ. కొండూరు మండలం చీమలపాడు సచివాలయం వద్ద పింఛను కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

ఇబ్బంది పెట్టడం తగదు



వలంటీర్లు లేకపోవడంతో మండుటెండలో వచ్చి పింఛను తీసుకోవాల్సి వచ్చింది, గత నెల వరకు వలంటీరు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛను డబ్బులు ఠంఛనుగా ఇచ్చేవారు. పింఛను విషయంలో వృద్ధులను ఈ విధంగా ఇబ్బంది పెట్టడం సమంజసమా?

– చల్లా భూలక్ష్మి, విస్సన్నపేట

వలంటీర్లను ఆపేయడం దుర్మార్గం



నాపేరు నడకుదిటి వీరవర్మ. కిలేశపురంలో ఉండే నేను నాలుగేళ్ల కిందట లారీ క్లీనర్‌గా పనిచేసుకుంటూ ప్రమాదానికి గురయ్యాను. కాలుకి గాయమై నడవలేని స్థితిలో ఉన్నాను. దివ్యాంగుల కోటాలో ప్రతి నెలా వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి రూ.3 వేలు పింఛన్ అందించేవారు. ఇప్పుడు చంద్రబాబు వలంటీర్లపై రాద్ధాంతం చేయడం వలన ఒకటో తేదీన రావల్సిన పింఛన్ ఇప్పటి వరకు రాలేదు. ఈనెల సచివాలయానికి వెళ్లి తీసుకోవాలి అని చెప్పడంతో అతికష్టం మీద ఇక్కడికి చేరాను. మా ఉసురు టీడీపీకి తగులుద్ది.

–నడకుదిటి వీరవర్మ, కిలేశపురం

చాలా కష్టంగా ఉంది



గత నెలలో వలంటీరు ఇంటికే వచ్చి పింఛను పంపిణీ చేయటంతో దివ్యాంగుడినైన నాకు చాలా సౌకర్యంగా ఉండేది. వలంటీర్లను పింఛన్లు పంపిణీ చేయవద్దనటంతో నాలాంటి వాళ్లు చాలా ఇబ్బంది పడి వీల్‌చైర్‌లో సచివాలయానికి వచ్చి పింఛను తీసుకోవాల్సి రావటం కష్టంగా ఉంది.

– మల్లాది విజయ్‌బాబు, విస్సన్నపేట

ఇబ్బంది పడుతున్నాం



గత నెలవరకు వలంటీరు ఒకటో తేదీనాడే ఇంటికి వచ్చి దివ్యాంగుల పింఛను అందించేవారు. ఈ నెలలో వారిని పింఛను పంపిణీ చేయవద్దనటంతో కిరాయికి ఆటో కట్టించుకొని సచివాలయం వద్దకు వచ్చి వేచి ఉండి పింఛను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాలాంటి దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేయటం సరికాదు.

– కాలంగుల కృష్ణకుమారి, విస్సన్నపేట

టీడీపీ తీరుతో పాత రోజులు వచ్చాయి



నామాల సుబ్బారావు అనే నేను కొండపల్లిలో కూలీ చేసుకుంటూ నివశిస్తున్నాను. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.3 వేలు వలంటీర్ల ద్వారా పింఛను ఇంటివద్దే అందిస్తోంది. ఒకటో తేదీ తెల్లవారు జామునే ఇంటికొచ్చి నిద్రలేపి పింఛను ఇచ్చేవారు. వలంటీర్లను టీడీపీ నేతలు అడ్డుకోవడంతో మరలా పాత రోజులు వచ్చినట్లున్నాయి. వలంటీర్లే పింఛన్ అందించాలని కోరుతున్నాను.

–నామాల సుబ్బారావు, కొండపల్లి

ఇంటివద్దే అందజేయాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా మాకు పింఛన్లు పంపిణీ చేయించేవారు. ప్రతిపక్షాలు కుట్రతో ఇప్పుడు ఎన్నికలొచ్చాయనే కారణంగా వలంటీర్లను తొలగించి మా వంటి వృద్ధుల్ని ఇబ్బంది పెట్టడం తగదు. నడవలేనివారికి ఇంటివద్ద పింఛన్లు అందజేయాలి.

– చెరుకు మల్లయ్య, చీమలపాడు

వైఎస్ జగన్ దేవుడు



ఇంతవరకు మాకు పింఛను తీసుకోడానికి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం రాకుండా సీఎం జగన్ కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఇప్పుడు సచివాలయానికి వచ్చి పింఛను డబ్బులు తీసుకోవాలని చెప్పారు. నడవలేకపోయినా పెన్షను డబ్బుల కోసం రెండు కిలోమీటర్ల దూరం రావలసి వచ్చింది. ఇలా మమ్మల్ని ఇబ్బంది పెడితే ఎలాగయ్యా?

– మల్లాది ప్రసాద్, రామచంద్రాపురం

ఇబ్బందులు పెట్టడం దారుణం



పింఛన్ నగదును తీసుకోవడానికి మండుటెండలో సచివాలయం వద్దకు రావాల్సి వస్తోంది. చంద్రబాబు లేనిపోని పిటీషన్లు వేసి వలంటీర్లతో పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దుర్మార్గం. చంద్రబాబు ఇలా చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు. చేతనైతే సాయం చేయాలే గాని, ఇబ్బందులు పెట్టడం దారుణం.

– గుంపుల అనిత, 20వ వార్డు, నెహ్రూపేట

మాలాంటి వారిపైనా మీ ప్రతాపం



నాకు చిన్నప్పటి నుంచి పోలియో ఉంది. భర్త కూడా చనిపోయాడు. పింఛను డబ్బులే నాకు జీవనాధారం. ఆటో ఎక్కి వద్దామంటే డ్రైవర్ రూ.200 అడిగాడు. అవి ఇవ్వలేక గంట సేపు ఎండలో నడుచుకుంటూ, ఇబ్బంది పడుతూ సచివాలయానికి వచ్చాను. మాలాంటి వారిపైనా చంద్రబాబు ప్రతాపం.

– మల్లిబోయిన రోశమ్మ, ఆగిరిపల్లి

ఐదేళ్లుగా ఎలాంటి కష్టం తెలియలేదు



పింఛన్ కోసం సచివాలయం వద్దకు నడవలేకపోయాను. చేతి కర్ర సాయంతో నడిచేసరికి ఆయాసం వచ్చింది. వలంటీర్ వచ్చి ఇంటి దగ్గర పొద్దున్నే ఇచ్చేవారు. దానిని చెడగొట్టడం చంద్రబాబుకు మంచిది కాదు. వలంటీర్ ఇవ్వడంతో మాకు ఐదేళ్లుగా ఎలాంటి కష్టం తెలియలేదు.

– వెంకమ్మ, చనుబండ, చాట్రాయి మండలం

పాలనను గడప వద్దకు తెచ్చిన జగన్

మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న ప్రతాప్ అప్పారావు

నూజివీడు: సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలన్నా, పేదలు, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నా, వారికి మేలు జరగాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. రామన్నగూడెం, పోలసానపల్లిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాలనను ప్రజల గడప వద్దకు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నూజివీడు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రూ.21 కోట్లతో నూతన భవన నిర్మాణం, ఆగిరిపల్లి, రమణక్కపేటలలో పీహెచ్‌సీ భవనాలను నిర్మించామన్నారు. వీటితో పాటు నియోజకవర్గంలో దాదాపు 15 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ప్రజలందరూ మే నెలలో జరిగే ఎన్నికల్లో సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు.

చంద్రబాబుకు ఓటు వేసి తప్పు చేయవద్దు

2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలన వల్ల రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కు పోయిందని, మరోసారి ఆ తప్పు చేయొద్దని ఎమ్మెల్యే అన్నారు. రాజధాని పేరుతో ఏడాదిలో మూడు పంటలు పండే భూములను నాశనం చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. నూజివీడు ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేస్తున్నట్లు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి రాష్ట్ర ప్రజలందరిని మోసం చేశారని చెప్పారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, సర్పంచ్ శీలం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ, పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కలగర వెంకటేశ్వరరావు, రంగారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి జరిగిందన్న నోటితోనే అబద్ధాలా!

ఎమ్మెల్యే వసంతపై అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజం

మైలవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే మైలవరం నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని చెప్పిన నీవే.. మళ్లీ అదే నోటితో అభివృద్ధే జరగలేదని చెప్పడం ఏమిటని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల టీడీపీలో చేరిన వసంత వెంకట కృష్ణప్రసాద్ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా గత నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని చెప్పి ఇప్పుడు పార్టీ మారి అదే నోటితో ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గు చేటన్నారు. మైలవరం సీఎంఆర్ కల్యాణ మండపంలో టీడీపీ బూత్ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడిన పలువురు నాయకులు జగన్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మైలవరంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకేలు, గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, పలు నూతన భవనాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న నీకు అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం మానుకోవాలని, లేకుంటే నియోజకవర్గ ప్రజలే నీకు బుద్ధి చెబుతారన్నారు. అభివృద్ధికి అడిగిన వెంటనే ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారని చెప్పిన నోటితోనే ఇటువంటి అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ నేతల చర్యలను ప్రతిఒక్కరూ గమనించాలన్నారు. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు ఒక సామాన్యుడికి ఇవ్వడం చూపి ఓర్చుకోలేకే ఇటువంటి ప్రచారం వసంత వెంకట కృష్ణప్రసాద్ చేస్తున్నాడని విమర్శించారు.

కొణిజెర్ల సొసైటీలో నూరుశాతం రుణాల వసూలు

కొణిజెర్ల(గంపలగూడెం): గంపలగూడెం మండలం కొణిజెర్ల శ్రీ తిలక్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో వరుసగా నాలుగో ఏడాది మెంబర్ స్థాయిలో నూరుశాతం రుణాలు వసూలయ్యాయి. దీంతో సొసైటీ సీఈఓ ఎస్ఎం సుభానీ, సొసైటీ అధ్యక్షుడు నంభూరి వెంకటకృష్ణారావులను గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ టి. శ్రీనివాసరావు బుధవారం బ్యాంక్‌లో అభినందించారు. ఇరువురికి ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను సొసైటీలో 1,438మంది రైతుల నుంచి రూ.18.59 కోట్ల రుణాలు వసూలు కావాల్సి ఉండగా నూరు శాతం వసూలైందని వివరించారు. మేనేజర్ ఎస్. కనకదుర్గ, సూపర్‌వైజర్ మల్లాది యేసోబు, అరుణ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ఎజెండా

నల్లగట్ల సుధారాణి



తిరువూరు 14వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సుధారాణి

తిరువూరు: పేదల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కృష్ణా జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. తిరువూరు పట్టణంలోని 14వ వార్డులో బుధవారం ఆమె విస్తృత ప్రచారం చేశారు. వార్డులోని ఇంటింటికీ వెళ్లి తిరువూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి స్వామిదాసును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని, సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా అందిస్తామని చెప్పారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, పసుపులేటి శేఖర్‌బాబు, మూడు దుర్గారావు, మోదుగు ప్రసాద్, పరసా సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

నల్లగట్ల స్వామిదాసు



మాట్లాడుతున్న నల్లగట్ల స్వామిదాసు

ఊటుకూరు(గంపలగూడెం): మే నెలలో జరుగనున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు అందరూ సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెం మండల ఊటుకూరులో బుధవారం రాత్రి నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిపక్షాలు చేసేకుట్రలు, కుతంత్రాలను తిప్పి కొట్టే విధంగా పార్టీ శ్రేణులు గ్రామాలలో ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న నవరత్నాల ద్వారా ప్రజలకు ఎంత మేలు జరిగిందో వివరించాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ కోట శామ్యూల్, ఎంపీటీసీ ఆలపాటి సునీత, మండల పార్టీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ సంగీతం రాఘవయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం ముసునూరు మండలం వలసపల్లి, యల్లాపురం, బలివేలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆయా గ్రామాల్లో ప్రచారం జరుగుతుందని చెప్పారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

ఆగిరిపల్లి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ కోరారు. బుధవారం చిన్న ఆగిరిపల్లి, తోటపల్లిలో సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం సీఐ రామకృష్ణ ప్రజలతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎస్ఐ సురేంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

తిరువూరురూరల్: మండలంలో వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ తీరును ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సిబ్బంది ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు పింఛనుదారులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పింఛనుదారులకు అవసరమైన తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు.

మందకొడిగా పంపిణీ

ఆగిరిపల్లి: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం మందకొడిగా ప్రారంభమైంది. ఉదయం 6 గంటల నుంచి సచివాలయాల వద్ద పింఛను లబ్ధిదారులు, వృద్ధులు, వికలాంగులు పడిగాపులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. చంద్రబాబు తన రాజకీయ స్వార్థం కోసం తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పలువురు వృద్ధులు, వికలాంగులు వ్యాఖ్యానించారు. ఈదర సచివాలయంలో పింఛన్ల పంపిణీ తీరును ఆర్డీఓ భవాని శంకరి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి 8 గంటల వరకు పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.

దాములూరులో పోలీసు కవాతు



దాములూరు(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో ప్రజలకు భద్రత కల్పించేందుకే పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామని సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో దాములూరు, చిలుకూరు గ్రామాల్లో 100 మంది సివిల్, ఏఆర్, పారా మిలటరీ బలగాలతో పోలీస్ కవాతు బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలింగ్ సమయంలో నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఐ అనూష; పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.